వ్యాస కౌముది



# మహాకవి శ్రీశ్రీ

## - దూర్వాసుల వెంకట సుబ్బారావు

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

### శ్రీశ్రీ చమక్కులు

శ్రీ శ్రీ వ్యక్తిగత జీవితంలో హాస్యానికి చోటుంది. చాలా ప్రచారంలో ఉన్నది "విశ్వనాథుని మధ్యాకజులు, శ్రీశ్రీవి మద్యాక్కరులు, కృష్ణశాస్త్రివి మిధ్యాకరలు" అని. ఒకసారి రైల్వేస్టేషన్‌లో శ్రీ మొక్కపాటి నరసింహగారు శ్రీశ్రీతో "ఊరికేనా" అని అడిగితే "అవును, "ఊరికే" అన్నారుట శ్రీశ్రీ. ఒక పత్రికా సంపాదకుడు ముఖచిత్రంగా కొచ్చిన్ సిస్టర్సు వేద్దామా లేదా అని శ్రీశ్రీతో అంటే "ఎందుకొచ్చిన సిస్టర్సు, భోజనానికి వెళ్దాం పద" అని శ్లేషతో చమత్కరించేరుట శ్రీశ్రీ . శ్రీ వల్లం నరసింహారావు శ్రీశ్రీని ఓ నాటిక రాయమంటే, "ఏనాటికైనా రాస్తాను మిత్రమా" అని జవాబిచ్చేరుట. విశ్వనాథ సత్యనారాయణగారంటే శ్రీశ్రీకి గౌరవం, చనువుకూడా ఉండేవి. శ్రీశ్రీతో "నాకు పద్మవిభూషణ బిరుదు వచ్చిందని తెలుసా" అంటే "తెలుసు, పత్రికలో చదివా", అయితే మరి నన్ను ఎందుకు అభినందించలేదని విశ్వనాథ ప్రశ్నిస్తే, "మీకు భారత రత్న బిరుదు వచ్చాక అభినందిద్దామని ఉంది" అన్నారట శ్రీశ్రీ "అది నీకోసం రిజర్వులో ఉందోయ్" అన్నారట విశ్వనాథ. హైద్రాబాద్‌లో ఒకే హోటలులో ఉంటూ, విశ్వనాథ శ్రీశ్రీ గదికి వెళ్ళి ఆయన స్నానం చేస్తున్న సమయంలో చమత్కారంగా "శ్రీశ్రీ నీళ్ళాడుతున్నారంటే" "విశ్వనాథుడు కనుచుండగా, నేను నీళ్ళాడటంలో తప్పేముందని" అని తిరిగి చమత్కరించేరట. "మీ శిష్య రత్నం ఆరుద్ర ఎలా ఉనారని" ఎవరో శ్రీశ్రీ ని అడిగితే, "శిష్యుడంటే ఆయన ఒప్పుకోడు, రత్నం అంటే నేను ఒప్పుకోను" అన్నారట శ్రీశ్రీ . అమర్ భూపాలి మరాఠీ చిత్రం ఆత్రేయతో కలిసి శ్రీశ్రీ చిత్రాన్ని చూసిన తర్వాత శాంతారామ్‌ని కలుసుకుంటే తన చిత్రం ఎలా ఉందని అడిగితే "మీరేమీ డైరక్టరుకాదు, కాని మహేంద్ర జాలికుడ"వని చమత్కరిస్తే శాంతారాం ఎంతగానో మెచ్చుకున్నారుట. రావిశాస్త్రి ఆయన్ని మంచి తెలుగు రాయాలంటే ఏం చేయాలని అడిగితే "ఇంగ్లీషు చదవండి" అని శ్రీశ్రీ జవాబిచ్చేరుట. "నువ్వు నువ్వు కావాలిగాని మరొకడు నువ్వుకాకూడదు" అని ముని సుందరంతో శ్రీశ్రీ చిత్తూరులో అన్నారుట. గొంతుక కేన్సర్‌తో సిగరెట్లు మానేశా. దేమునితో పోరాడి గెలిచా, చూశావా! శ్రీశ్రీ అంటే యుద్ధమే"నని శైలకుమార్‌తో అన్నారుట శ్రీశ్రీ. ‘లుంగీకి స్త్రీ లింగం లంగా ‘అని కాకి షష్ఠీవిభక్తి‘, ‘టీ తాగనివాడు తేనెటీగై పుట్టున్" శ్రీశ్రీ తలుపులేసుకుని ఏ పని చేయడు" అన్నవి శ్రీశ్రీ చలోక్తులే. అనకాపల్లి గౌరి గ్రంధాలయం వార్షికోత్సవానికి శుభాకాంక్షలు పంపమని శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణగారు కోరితే "ఈ గ్రంధాలయానికి నేను దినదినాభివృద్ధి కోరను" అని వ్రాసి చుక్క (.) పెడితే చాలామంది విస్తుపోయారుట. ఆ చుక్కని సెమికోలన్ (;)

గా మార్చి "మరి కోరేది క్షణక్షణాల అభివృద్ధి" అని వ్రాసేరుట శ్రీశ్రీ.మీరు వ్రాసిన 1+1 ఎలా అవుతుందంటే, ప్రేయసి + ప్రియుడు ఇద్దరూ ఒకటే, అలాగే దేముడు + మానవుడు ఒక్కటే అని శ్రీశ్రీ వేదాంతం చెప్పేరుట. శ్రీ రంగం నారాయణ బాబుని చిన్నన్నయ్య అని శ్రీ శ్రీ పిలిచేవాడు. నారాయణ బాబు దేవులపల్లి వారి "నా నివాసమ్ము తొలుత గంధర్వలోకము" అని గొంతెత్తి పాడుతుంటే "కవిత్వం ఇడ్లీలను సంగీతం సాంబారులో ముంచి వెండి ప్లేట్లలో సప్లయ్ చేసినట్టుండేది" అన్నారుట శ్రీశ్రీ . శ్రీశ్రీ సిప్రాలి చదివితీరవలసిందే! దీంట్లో సిరిసిరిమువ్వలు, మేమేలు, ప్రాసక్రీడల్, పంచ పదులు, లిమబుక్కులున్నాయి. కంద పద్యాలుగా

"మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ/న్నేళ్ళకి పద్యాలు రాయిటిది యెట్లన్నన్/
పళ్ళూడిన ముసలిదికు/కుచ్చిళ్ళన్ సవరించినట్లు సిరిసిరిమువ్వా!
"రమ్మని ఆహ్వానిస్తే/పొమ్మనడం పాడికాదు పూవిల్తునిరా/జ్యమ్మునకున్,
మధుశాలకు/చెమ్మసుమీ రెండు చోట్ల, సిరిసిరిమువ్వా!"
గౌను బనాయిస్తే దొర / సానిగ గడసాని మారజాలునే? ఖాదీ/తానులు సైతానుధరి
స్తే నాయకుడెట్టులవును? సిరిసిరిమువ్వా!

మచ్చుకి ఉదహరిస్తున్నా.

శ్రీశ్రీకి విదేశి మద్యం సేవించే అలవాటున్నా, రచనా దీక్ష మంచి క్రమశిక్షణతో నడిపించేవారని శ్రీ కేతు విశ్వనాథరెడ్డిగారి అభిప్రాయం. శ్రీ ఆది శంకరుల మాయ (మిధ్యా) వాదాన్ని ఛాందసులు భ్రష్టు పట్టించి నేటికాలంలో మతం పేరిట మోసగిస్తూ, దోపిడి చేసిన వేదాంతులని హేళన చేస్తూ శ్రీశ్రీ ఇలా అన్నారు. "మాయంటావా? అంతా మిధ్యంటావా? నా ముద్దుల వేదాంతి, ఏమంటావు? కనబడినది కనబడదని, వినబడినది వినబడదని, జగతిమరుపు, స్వప్నం, నిశ్శబ్దం ఇది మాయ, మాయమంటావు! అంతా మిధ్యంటావు! అంతా మిధ్యంటావు! "

"నువ్వు రాసిపారేసిన కవితలు గుబాళిస్తుంటే, నువ్వు తాగిపారేసిన ఖాళీ సీసాల కంపు నాకెందుకు" అన్నారు శ్రీకాళోజీ - అంటే ఆ కవితలే సాహిత్యాన్ని శాసిస్తోంది అని అర్థం. తనకి కోపం వస్తే వ్యక్తిగతంగా తన రాగద్వేషాల్ని తెలియజేస్తూ హాస్యంగానే దాశరథిని పొట్టికవి అని, సోమసుందర్‌ని దోమసుందర్ అని, ఆరుద్రని రోమలక్ష్మీపతి అని పేరు పెట్టేరు. ఆలిండియా రేడియో వారి ఉగాదిలకు విశ్వావసు, పరాభవ, సౌమ్య, సాధారణ, రాక్షస సంవత్సరాల్ని ఆహ్వానిస్తూ "వచ్చావా రాక్షసా, రా! తెచ్చేవా ద్రాక్షసారా! లాంటివి వినిపించేవారు.

ఓసారి రాజమహేంద్రవరంలో ఆయనకి గొప్ప సన్మానం చేయడానికి ఏర్పాట్లు చేస్తూంటే, "నాకెందుకీ సన్మానం? మీ ఊళ్ళో ఒకమహాకవి ఉండగా, ఆయన్ని సన్మానించకుండా నాకు సన్మానమా? భేష్ - ఇది బాగుందా! బాగుంటుందా? అంటూ శ్రీ కవి కొండల వెంకటరావు "శివరాత్రి ప్రభ" "గజ్జిపూలు" గానం చేసేరుట. అలాగే వీరేశలింగం పంతులు గారు స్మారక గృహాన్ని చూసి, వారుండి రాసుకునే గది ఇదేనని పెద్దలు చెపితే, శ్రీశ్రీ అక్కడ ఆపాదమస్తకంగా బోర్లాపడుకుని పొర్లి పొర్లి దండాలు పెట్టిన 'ముగ్ధ స్నిగ్ధ భావోద్విగ్న హృదయుడు శ్రీశ్రీ అని శ్రీ అక్కిరాజు రమాపతిరావుగారు తెలియజేసేరు. అలాగే శ్రీ "విశ్వనాథ నవకవులలో ప్రాచీనుడు - ఈయన పద్యాలు మహాబలిపురపు రాతి గోపురాలు" అన్నారు శ్రీశ్రీ. "తెలుగు వాళ్ళలో పైకి వచ్చిన వాళ్ళంతా పైకిపోయినవాళ్ళే" శ్రీశ్రీ సూక్తి. "ఒక పదిహేనేళ్ళు ఓపిక పట్టండి. మాతృభాష తెలుగు, పితృ భాష హిందీ, పితామహభాష సంస్కృతం, సోదరభాష అరవం, సోదరీ భాష కన్నడం. ఇలాగ ఒక పెద్ద అవిభక్తకుటుంబం ఆవిర్భవిస్తుంది" అన్నది శ్రీశ్రీ మాట ఈనాడు నిజమే.

<u>శ్రీశ్రీ పేరడీలు</u>

శ్రీశ్రీ చెరగని చేవ్రాలు. ఆయన కవిత్వం నిత్యనూతన స్రవంతి. విస్తృత వ్యాప్తిలో ఉన్నది. ఆ కవితారీతులను అనుసరిస్తూ, అనుకరిస్తూ ఎందరో పేరడీలు ఆర్ద్రతతో సహా వ్రాశారు. శ్రీ చీకోలు సుందరయ్యగారి వ్యాసాలు చదవవలసిందే

ఏవి తల్లి నిరుడు కురిసిన హిమసమూహములు

చక్రవర్తి అశోకుడెక్కడ, జగద్గురు శంకరుండెక్కడ. శ్రీశ్రీ అంటే

ఏవి తల్లి నిరుడు మండిన ఎండు తాటాకుల్.

దుర్గభాయీ భర్గురాణి భీకరానన స్పీకరేది.. అని ఆర్ద్ర అన్నారు. గిరులు, సాగరులు, కంకేళికా మంజూరులు నా సహోదరులు. శ్రీశ్రీ

ప్రయాణ బత్తాలు, ఎడ్వాన్సులు, ఎరియర్లు, మందు బిల్లులు నా సహచరులు ..శ్రీ కాట్రగడ్డ

ఏదేశ చరిత్ర చూసినా ఏమన్నది గర్వకారణం... శ్రీశ్రీ

ఏ పాప పైటజారినా.... పాపల పవిత్ర క్షేత్రం

పడుపు వృత్తి పూజా సత్రం.. శ్రీ కాట్రగడ్డ

నైలునది నాగరికతలో/సామాన్యుని జీవనమెట్టిది?.. శ్రీశ్రీ

చిత్రసీమ నాగరికతలో/సామాన్యుని జీవనమెట్టిది?.. శ్రీశ్రీ

చిత్రసీమ నాగరికతలో, ఎక్స్ట్రాల జీవనమెట్టిది

చలన చిత్ర నిర్మాణానికి సిగ్గొదిలిన శ్రీమంతులెందరు?

పురాణం సుబ్రహ్మణ్యేశ్వర శర్మగారు "సీత" పేరుతో శ్రీశ్రీ కవిత్వంలోని బిగువూ, బరువూ లేకపోయినా కొన్ని పేరడీల నవీనగీతికి, నవీన రీతికి ప్రాణం పోసాయి. ఉదాహరణకు:

> "మరో ప్రపంచం, మరోప్రపంచం...పిలిచింది
> పదండి ముందుకు, పదండి త్రోసుకు! పోదాం పైపైకి".. శ్రీశ్రీ
> మరోకంచం, మరో లంచం, మరో మంచం పిలిచింది
> పదండి విందుకు, పదండి కాసుకు, పోదాం పోదాం పదవుల్లోకి

కమలాకరం వ్రాశారు

> "భూతాన్ని, యజ్ఞోపవీతాన్ని, వైప్లవగీరాన్ని"...శ్రీశ్రీ
> బూతుని, కామోద్రేకాన్ని, గుప్తాంగ విన్యాసాన్ని నేను...
> అవాంఛనీయ ధోరణులను ఖండిస్తూ ప్రసేన్ - ఒక యువకవి వ్రాశారు.
> "పొలాలనన్ని, హలాల దున్ని, ఇలా తలంలో
> హేమం పండగ, జగానికంతా సౌఖ్యం నిండగ
> ఖరీదు కట్టే షరాబులేడోయ్"

అని శ్రీశ్రీ ఉరకలు వేయించి మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తే అవాకులన్నీ, చవాకులన్నీ, మహారచనలై మహిలో నుండగ

ఎగబడి చదివే పాటకులుండగ...

బిరుదుల మాలకు, దుశ్శాలువలకు, కరతాళాలకు ఖరీదులేదోయ్ అని సినీకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు.

శ్రీశ్రీ నేటి తరానికి అనుసరణీయులు, ఎన్నటికీ ఆదర్శనీయులే.

***సినిమా కవిత్వం***

శ్రీశ్రీ 1950 - 1983ల మధ్య 42 సినీమాలకి, ముఖ్యంగా సందేశ పూరిత పాటలు వ్రాశారు. వీటిలో కూడా సామాజిక దృక్పథం ఎక్కువ పెట్టుబడిదారి వ్యవస్థ పోయి సోషలిజం రావాలని "పాడవోయి భారతీయుడా", "పదవీ వ్యామోహాలు, కులమత భేదాలు, భాషా ద్వేషాలూ చెలరేగనేడు" "సమసమాజ నిర్మాణమె నీ ధ్యేయం సకల జనుల సౌభాగ్యమె నీ లక్ష్యం" "తెలుగు వీర లేవరా దీక్షబూని సాగరా/దేశమాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా" అల్లూరి సీతారామరాజు చిత్రానికి వ్రాశారు. జాతీయ స్థాయిలో సినిమా రంగంలో దీనికే కేంద్ర ప్రభుత్వ బహుమతి లభించింది ఆ రోజుల్లో. "వాడిన పూలే వికశించెరా "(మాంగల్యబలం చిత్రంలో) "కలకానిది విలువైనది బ్రదుకు", "ఎవరో వస్తారని, ఏదో చేస్తారని", "నా హృదయంలో నిదురించే చెలీ!", "నిన్ను నిన్నుగా ప్రేమించుటకు", "దేవుడు చేసిన మనుషుల్లారా", "పయనించే మన వలపుల బంగారు నావ", "జోరుగా హుషారుగా షికారు పోదమా", "బొమ్మను చేసి ప్రాణము పోసి ఆ దేవునికిది వేడుక," "నేను సైతం", "ఆనందం అర్ణవమైతే" ఆంధ్ర ఆబాలగోపాలం విని ఆనందించి గీతాలే. "చెవిలో రహస్యం" చిత్రం నిర్మించి ఆర్థికంగా నష్టపోయారు. మామూలు కవితలు వ్యక్తి కృషి, సినీమా కవిత సమిష్టి కృషి, అందుచే సామ్యవాదంలో శ్రీశ్రీ సినిమా సంగీతం హెచ్చు అని శ్రీ వాకాటి పాండు రంగారావుగారు చమత్కరించేరు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Click here to share your comments on this essay